నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 28 నవంబర్ 2024 | SIDDIPET

దీక్షాదివస్‌ను సక్సెస్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌లో దీక్షా దివస్ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 27: జిల్లా కేంద్రంలో ఈనెల 29న నిర్వహించే దీక్షా దివస్‌ను సక్సెస్ చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ చౌరస్తాలో చేపట్టే దీక్షా దివస్ స్థలాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు, కో కన్వీనర్ లింగారెడ్డి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 60 ఏండ్ల తెలంగాణ ప్రజల కల సాకారం కోసం 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష చరిత్రలో నిలిచిపోయిందన్నారు. నాడు కేసీఆర్ చేపట్టిన దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిందన్నారు. అందుకే నవంబర్ 29కి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష వల్లనే అప్పటి కేంద్రం దిగివచ్చి తెలంగాణ ఇచ్చిందన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పి ఉద్యమ చరిత్రపై చెరగని ముద్ర వేసిన మహా నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదన్నారు. కేసీఆర్ పాలనను రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రజా పాలనను గాలికి వదిలేసి కూల్చివేతలు, పథకాల్లో కోతలు, అభివృద్ధి పేరుతో విధ్వంసాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని ఆరోపించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు పట్లోరి రాజు, అరుణ్, కిరణ్, కుమార్ ఉన్నారు.

బడుగుల ఆశాజ్యోతి 'ఫూలే'



సంగారెడ్డిలో ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు

- **సంగారెడ్డిలో నివాళులర్పించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 27: మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతిని బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరయ్యారు. మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబాపూలే బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవమన్నారు. వారి అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. 30వ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని, గతంలో వార్డు అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేయించానని గుర్తుచేశారు. ప్రభుత్వం మారడంతో మంజూరైన నిధులు రద్దైనట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వార్డు అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని వెల్లడించారు. అనంతరం కాలనీ వాసులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించారు. మాజీ సీడీసీ చైర్మన్లు విజయేందర్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, అనంతయ్య, బీరయ్య యాదవ్, ఆంజనేయులు, అన్వర్ పాల్గొన్నారు.

సెంట్రల్ స్టోర్స్ రికార్డులు మాయం?

- **మల్లన్న ఆలయ ఉద్యోగులకు నోటీసులు జారీ**

చేర్యాల, నవంబర్ 27: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన సెంట్రల్ స్టోర్స్ రికార్డులు మాయమైనట్లు తెలిసింది. మల్లన్న ఆలయ సెంట్రల్ స్టోర్స్‌కు సంబంధించి వివిధ వస్తువుల కొనుగోలు, చెల్లింపులకు సంబంధించి నమోదు చేసిన వివిధ రికార్డులు, ఫైళ్లు (2013, 2014, 2015, 2016) ఆలయ కార్యాలయంలో కనిపించక పోవడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి బాలాజీ ఇటీవల మల్లన్న ఆలయంలో విధులు నిర్వహించి ప్రస్తుతం వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. ఆలయంలో గతంలో పనిచేసిన ఉద్యోగులు వెంటనే వివరాలు అందించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈవో నోటీసులో పేర్కొన్నారు. ఆలయ ఈవో నోటీసులు జారీ చేసిన అనంతరం నాలుగు రికార్డులు లభించగా మరిన్ని రికార్డులు అందుబాటులో లేనట్లు తెలిసింది.



రంగధాంపల్లి దీక్షాస్థలి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ కార్యకర్తలు (ఫైల్)

ఉద్యమానికి ఊపిరిపోసిన దీక్షా దివస్

రంగధాంపల్లిలోని అమరవీరుల స్తూపం

రేపు జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాల నిర్వహణ

సన్నాహక సమావేశాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు

సిద్దిపేటలో పాల్గొననున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

దీక్షాస్థలిలో నిద్రిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు(ఫైల్)

సిద్దిపేట, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మలిదశ ఉద్యమంలో మరో ప్రస్థానం.. అత్యంత కీలకమైన రోజు.. యావత్తు తెలంగాణ జాగృతమైన దినం... నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలను ఉద్యమంలో నడిచేందుకు ఊపిరి లూదిన రోజు.. తెలంగాణ ప్రజలను ఐక్యం చేసి ఏకతాటిపై తీసుకువచ్చి ప్రత్యర్థులకు ఉద్యమ రుచి చూపిన దినం 2009 నవంబర్ 29. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గడగడలాడించి శంఖారావం పూరించిన రోజు.. తెలంగాణ ఉద్యమ రథసారథి.. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది.. నవంబర్ 29తో దీక్షా దివస్‌కు పదిహేనేండ్లు పూర్తవుతున్నాయి. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని బీఆర్ఎస్ పలు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించి ఆదిశగా రెండు రోజులుగా జిల్లా కేంద్రాల్లో పార్టీ నేతలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ చేపట్టనున్నారు. ఇప్పటికే పార్టీ ఇన్‌చార్జిలను నియమించగా వారి నేతృత్వంలో కార్యక్రమాలు జరగనున్నాయి. సిద్దిపేటలో జరిగే దీక్షా దివస్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొంటారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొననున్నారు. సిద్దిపేటలో జరిగే కార్యక్రమాల్లో భాగంగా తొలుత ప్రశాంత్‌నగర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకొని దీక్ష చేపడుతారు. పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

నాటి ఉద్యమ స్మృతులు

దాదాపు 14ఏండ్ల పాటు తెలంగాణ ఉద్యమాన్ని ఒంటి చేత్తో నడిపిన నాటి ఉద్యమ రథసారథి, గులాబీ అధినేత కేసీఆర్. ఉద్యమంలో ఎలాంటి హింసకు తావులేకుండా, శాంతియుతంగా, గాంధేయ మార్గంలో పోరాడి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు జనాన్ని కదిలించి ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన ధీరుడు కేసీఆర్. ఆనాటి ఉద్యమ సమయంలో చోటు చేసుకున్న అనూహ్య పరిణామాలు.. ఇప్పటికీ జనాల హృదయాల్లో పదిలంగా ఉన్నాయి. చరిత్రలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్ర సాధన కోసం 42 రోజుల పాటు చేపట్టిన సకల జనుల సమ్మెతో పాలన స్తంభించింది. ఆమరణ నిరాహార దీక్షకు కేసీఆర్ కరీంనగర్ నుంచి బయలుదేరి సిద్దిపేట దీక్షా స్థలానికి చేరుకుంటున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. దీంతో సిద్దిపేట ఆమరణ నిరాహార దీక్ష స్థలిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 14ఎఫ్ రగడ.. తెలంగాణ ఉద్యమ దశను దిశగా మార్చి ఉద్యమానికి నాంది పలికి ఒక ప్రభంజనంలా సృష్టించింది ఖచ్చితంగా కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష. హైదరాబాద్ నగరాన్ని ఆరో జోన్ నుంచి వేరు చేస్తూ ఫ్రీజోన్‌గా మార్చేందుకు తీసుకున్న నేపథ్యంలో కేసీఆర్ తీసుకున్న 14ఎఫ్ రగడ సంచలన నిర్ణయానికి నాంది పలికింది. ఆరవై ఏండ్లుగా తెలంగాణ ప్రజలు అణిచివేతకు గురవుతున్న పరంపరలో ఫ్రీజోన్ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి తెలంగాణ ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి తెచ్చింది. ఉద్యమాల పురిటిగడ్డ సిద్దిపేటలో ఫ్రీజోన్.. కాదురా.. హైదరాబాద్ మాదిరా.. పేరిట 14ఎఫ్‌కు వ్యతిరేకంగానిర్వహించిన ఉద్యోగ గర్జన భారీ బహిరంగ సభ కేసీఆర్ సంచలన నిర్ణయానికి వేదికైంది. ఈ సభలో కేసీఆర్ తెలంగాణ కోసం 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమైనట్లు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమానికి దిక్సూచి అయిన సిద్దిపేటలో తాను దీక్ష చేపడుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. ఉద్యమ సారథి కేసీఆర్ ప్రకటనలతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో పెను సంచలనాలు సృష్టించాయి. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, పెను మార్పులు ఎన్నో కీలక ఘట్టాలను ఆవిష్కరించాయి. హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ సాధించే వరకూ అదే స్ఫూర్తితో వేలాది మంది విద్యార్థులు ఆత్మబలిదానాలకు సైతం పాల్పడి తెగించి కొట్లాడి తెలంగాణ వాదాన్ని బలపరుస్తూ అదే పంథాను కొనసాగించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ విద్యార్థి లోకం, ఉద్యమకారులు, అమరులు నిరంతరం తమ వాణిని వినిపించారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ముక్త కంఠంతో ఆంధ్రోళ్లతో కొట్లాడితే ఆమరణ దీక్ష అనంతరం ఐదేండ్లకు తెలంగాణ రాష్ట్రం వచ్చింది. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం యూపీఏ పరిణామాలు, ఉత్కంఠల నడుమ వాయిదాలపై ఊరిస్తూ అఖిలపక్ష తీర్మానాలు చేయించి లోక్‌సభలో ఫిబ్రవరి 18న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. రాజ్యసభలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణకు ఆమోద ముద్రవేశారు. ఈ మేరకు మార్చి 1న రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజముద్ర వేశారు. తదనంతరం తెలంగాణలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉద్యమ పార్టీ టీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడంతో అదేరోజు తెలంగాణ ఉద్యమ రథసారథి, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. పదేండ్లలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపారు.



రంగధాంపల్లి దీక్షా శిబిరం వేదిక

ఉద్యమ సారథి కేసీఆర్ తన ఆమరణ నిరాహార దీక్షకు సిద్దిపేటను వేదికగా ఎంచుకున్నారు. సిద్దిపేట చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉద్యమ స్ఫూర్తిని చాటింది. ఇదే క్రమంలో కేసీఆర్ దీక్షను సవాల్‌గా తీసుకున్న హరీశ్‌రావు పార్టీ ముఖ్యనేతలు, నాయకులు, కార్యకర్తలతో కలిసి రంగధాంపల్లి అమరవీరుల స్తూపం సమీపంలో దీక్షా శిబిర వేదిక ఏర్పాట్లను ముమ్మరం చేశారు. వేలాదిగా తరలివచ్చే ఉద్యమకారులు కూర్చునేందుకు వీలుగా విశాలమైన ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ఓవైపు తెలంగాణ వాదులు దీక్షా ఏర్పాట్లలో నిమగ్నమైతే.. మరోవైపు సిద్దిపేటలో అడుగడుగునా ఆంక్షలు, తనిఖీలతో వేలాదిగా పోలీసు బలగాలు మోహరించి ఖాకీ వనాన్ని తలపించాయి. పదుల సంఖ్యలో ఐపీఎస్ అధికారులు, వందల సంఖ్యలో సీఐలు, ఎస్సైలు, వేలాదిగా సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు సిద్దిపేట నలువైపులా మోహరించాయి. మెదక్, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట మీదుగా రంగధాంపల్లి దీక్షా శిబిరం వైపు వచ్చేందుకు దారులన్నీ నిషేధించి.. ముళ్లకంచెలతో మూసివేశారు. పోలీస్ అధికారుల వ్యూహాలను ఎప్పటికప్పుడు కనిపెడుతూ హరీశ్‌రావు పకడ్బందీ ప్రణాళికతో సవాల్‌గా తీసుకుని ముందుకెళ్లారు. దీక్షా వేదిక రక్షణ పార్టీ నాయకులు, ముఖ్యంగా హరీశ్‌రావుకు సవాల్‌గా మారింది. భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, తెలంగాణ వాదులు, కార్యకర్తలు దీక్షా ప్రాంగణానికి చేరుకోవడంలో సఫలీకృతులయ్యారు. ఈ నేపథ్యంలో.. క్షణానికో.. పుకార్లు.., నిమిషానికో ఎత్తుగడలతో పోలీస్ అధికారులు ప్రజల్లో.., ఉద్యమకారుల్లో ఒక రకమైన భయాందోళనలు సృష్టించారు. రంగధాంపల్లి దీక్షా వేదికను భగ్నం చేసేందుకు కీలకమైన బాధ్యత మాత్రం ఐపీఎస్ అధికారి లడ్డాకు అప్పగించడంతో తెలంగాణవాదులు, ఉద్యమకారుల్లో మరింత ఆందోళనకరంగా మారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

కేసీఆర్ అరెస్ట్ వార్తతో అలజడి...

సిద్దిపేటలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద పోలీసుల పహారా (ఫైల్)

కేసీఆర్ అరెస్టు వార్త విన్న వెంటనే సిద్దిపేటలోని రంగధాంపల్లి దీక్షా శిబిరంలో అలజడి మొదలైంది.. కేసీఆర్ అరెస్టు వార్త తెలుసుకున్న వెంటనే ఆయన స్థానంలో హరీశ్‌రావు దీక్ష చేపట్టారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్యనేతలు దీక్షాలో కూర్చున్నారు. వీరికి వందలాది మంది కార్యకర్తలు, నాయకులు దీక్షా స్థలికి రక్షణగా నిలిచారు.అప్పటికే పోలీస్ అధికారులు వేచిచూసిన సమయం ఆసన్నం కావడంతో.. పోలీసు బలగాలు పన్నిన వ్యూహంతో బారికేడ్లను బద్దలు కొట్టి దీక్షా ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఓవైపు పోలీసులు తెలంగాణ వాదులపై లాఠీలు ఝుళిపిస్తే.. మరోవైపు కోపోద్రిక్తులై తెలంగాణవాదులు రాళ్లతో దాడి పాల్పడ్డారు. కొన్ని నిమిషాల వ్యవధిలో శిబిర ప్రాంగణం ఉద్రిక్త పరిస్థితుల నడుమ కొనసాగింది. అసలేం.. జరుగుతుందో.. తెలుసుకునే లోపే బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, తెలంగాణ వాదులను ఒక్కొక్కరిగా అరెస్టు చేశారు.పోలీసులు భారీగా శిబిరానికి దూసుకొచ్చి హరీశ్‌రావుతో సహా ముఖ్య నాయకులను అరెస్టు చేసి వేర్వేరు పీఎస్‌లకు తరలించారు.

గంజాయి నిందితుల అరెస్టు

- **వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి**

వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, నవంబర్ 27: గంజాయి విక్రయిస్తున్న నిందితులను పట్టుకొని అరెస్టు చేసినట్లు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసుల నిఘా ఉంచి చాకచక్యంగా గంజాయి అమ్ముతున్న నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అరికెల శేఖర్, బోయిని నరేశ్, కొండపాక మండలం సిరిసిన గండ్లకు చెందిన సుక్కసారి భానుప్రసాద్ చెడు అలవాట్లకు బానిసగా మారి గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. గంజాయి తీసుకురావడానికి సీలేరుకు వెళ్తున్నట్లు వారం రోజుల క్రితం శేఖర్, నరేశ్ స్నేహితుడు భానుప్రసాద్‌కు ఫోన్ చేయగా నాకు కూడా గంజాయి కావాలని చెప్పి అతడు రూ.7వేలు వారికి ఫోన్ పే చేశాడన్నారు. వారిద్దరూ సీలేరుకు వెళ్లి వర్ధన్ వద్ద రూ.30,800లకు 20కిలోల గంజాయి కొనుగోలు చేశారని, అందులో రెండు కిలోలు భానుప్రసాద్‌కు ఇచ్చాడన్నారు. మల్లన్నసాగర్ కట్టపై ఉన్న వారి నుంచి 10 కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అరికెల శేఖర్, సుక్కసారి భానుప్రసాద్‌ను అదనపు సీఐ ముత్యంరాజు సిబ్బందితో పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. పరారీలో ఉన్న నిందితులు బోయిని నరేశ్, సీలేరుకు చెందిన వర్ధన్‌ను త్వరలోనే పట్టుకుంటామన్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, ఇన్స్పెక్టర్లు జానకీరాంరెడ్డి, రమేశ్, సిబ్బంది గజ్వేల్ సీఐలు సైదా, ముత్యంరాజులను సిద్దిపేట సీపీ అనురాధ అభినందించినట్లు తెలిపారు.

ఐఐటీహెచ్‌లో ఏఎస్ఎం, ఎంఏ చాప్టర్లు ప్రారంభం

కంది, నవంబర్ 27: సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో అమెరికన్ సొసైటీ ఫర్ మెటల్స్ (ఏఎస్ఎం), మెటీరియల్స్ అడ్వాంటేజ్ (ఎంఏ) చాప్టర్లను బుధవారం ప్రారంభించారు. ఏఎస్ఎం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ నవీన్ మంజూరన్, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై చాప్టర్లను ప్రారంభించారు. విద్యార్థులకు సైన్స్, ఇంజినీరింగ్ టెక్నాలజీలో నూతన పురోగతిని పరిచయం చేయడం, విస్తృతం, పరిశోధన కోసం ఈచాప్టర్లు దోహదపడనున్నాయి. 140 మంది సభ్యులు నమోదు చేసుకోగా, ఐఐటీహెచ్ ఫ్యాకల్టీ, స్టూడెంట్లు, ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంజీరాలో దూకి తల్లీ కొడుకు ఆత్మహత్య

అందోల్, నవంబర్ 27: మంజీరానదిలో దూకి తల్లీకొడుకు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని చింతకుంట శివారులో చోటుచేసుకుంది. జోగిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చింతకుంట గ్రామానికి చెందిన వడ్ల బాలమణి (46), వడ్ల శ్యామ్ (21) తల్లీ కొడుకులు. శ్యామ్ పలువురి వాహనాలు దొంగతనం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో అతడు వాహనాలు దొంగతనం చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కాగా గ్రామంలో పంచాయితీ సైతం నిర్వహించారు. దొంగతనం చేసిన వాహనాలు అప్పగించాలని, దీనిపై మాట్లాడేందుకు రావాలని వాహనాలకు సంబంధించిన వారు బాలమణి, శ్యామ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి తల్లీ కొడుకు బాలమణి, శ్యామ్ బైక్‌పై వెళ్లగా... మరికొంత మంది కుటుంబ సభ్యులు బస్సులో బయలుదేరారు. వాళ్లు వెళ్తున్న బైక్ చింతకుంట శివారులోని మంజీరా వంతెన వద్దకు రాగానే పంచాయితీ భయంతో శ్యామ్ నీటిలో దూకగా... తల్లి సైతం దూకేసింది. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రాత్రి సమయం కావడంతో మృతదేహాలను బయటకు తీయడం కష్టంగా మారింది. బుధవారం గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాండు తెలిపారు.

ఆక్రమణలపై నివేదిక సిద్ధంచేయాలి

- **హైడ్రా కమిషనర్ రంగనాథ్**
- **సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెరువుల పరిశీలన**



సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మేళ్లచెరువులో ఎఫ్‌టీఎల్‌ని పరిశీలిస్తున్న రంగనాథ్

రామచంద్రాపురం, నవంబర్ 27: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మేళ్ల చెరువు, వనం చెరువు, చెలికుంట చెరువులను బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆయా చెరువులకు సంబంధించిన ఆక్రమణలపై ఆరా తీశారు. చెరువు పరిసరాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేళ్ల చెరువు, వనం చెరువు, చెలికుంట, కొల్లూర్ పెద్దచెరువుల్లో జరిగిన ఆక్రమణలపై తెల్లాపూర్ సాగునీటి సంఘం మాజీ చైర్మన్ వడ్డె నర్సింహులు హైడ్రా కమిషనర్‌కు వివరించారు. గతంలోనే ఆయా చెరువులకు సంబంధించిన ఆక్రమణలపై హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, అందుకు సంబంధించిన పేపర్లను కార్యాలయంలో ఇచ్చానని నర్సింహులు వివరించారు. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల జాబితాలో తెల్లాపూర్‌కు సంబంధించిన చెరువుల వివరాలు లేవని హైడ్రా కమిషనర్ దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. ఈ విషయంపై పరిశీలన చేస్తామని కమిషనర్ చెప్పారు. మేళ్లచెరువులో మట్టి నింపి ఆక్రమణకు పాల్పడిన రాజయాదవ్‌తో కమిషనర్ మాట్లాడారు. ఇది తమ పట్టా పొలమని, తమకు గతంలోనే అధికారులు ఎన్‌వోసీ ఇచ్చారని చెప్పాడు. దీనికి స్పందించిన కమిషనర్ గతంలో ఇచ్చిన ఎన్‌వోసీలను రద్దు చేశామని, చెరువు ఎఫ్‌టీఎల్‌లో నింపిన మట్టిని తొలిగించాలని ఆయనకు సూచించారు. చెరువుల ఆక్రమణలపై ఇరిగేషన్ డీఈ రామస్వామిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరో రెండు నెలల్లో మళ్లీ వస్తానని, చెరువుల ఆక్రమణలపై పూర్తి నివేదిక సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు హైడ్రా కమిషనర్ సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఇరిగేషన్ డీఈ రామస్వామి, ఏఈ సంతోషి, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- **జిల్లా వ్యాప్తంగా 1,73,000 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**
- **మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**
- **రామాయంపేట మండలం అక్కన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన**

అక్కన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

రామాయంపేట, నవంబర్ 27: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం మెదక్ జిల్లాలో ఆయన పర్యటించారు. రామాయంపేట ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి కుటుంబ సమగ్ర సర్వే ఆన్‌లైన్ డాటాను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోషల్ వెల్ఫేర్ కళాశాలలో వంట గదులు, అక్కన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వేలో 55వేల కుటుంబాల సర్వే పూర్తి చేసి డాటాను ఆన్‌లైన్ కంప్యూటరీకరణ చేశామన్నారు. డాటాలో ఏమైనా పొరపాట్లు జరిగితే వాటికి బాధ్యత ఎన్యూమరేటర్లదేనని సృష్టం చేశారు. కుటుంబ సర్వే డాటాను గోప్యతగా ఉంచాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో లక్షా 73వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ట్యాబ్, ఎంట్రీస్, ట్రక్‌షీట్, జనరేట్ మిల్లర్ల రసీదును తొందరగా పూర్తి చేసుకోవాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఇవన్నీ పూర్తి చేసిన ధాన్యానికి ప్రభుత్వం ద్వారా త్వరగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. తెలంగాణ గురుకుల సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజినీకుమారి, ఎంపీడీవో షాజులుద్దీన్, ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆన్‌లైన్ పూర్తి చేయాలి

రేగోడ్/చౌటకూర్/ నిజాంపేట, నవంబర్ 27: ఈనెలాఖరు వరకు సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ పూర్తి చేయాలని ఆర్డీవో రమాదేవి సిబ్బందికి సూచించారు. రేగోడ్ ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె సందర్శించి కులగణన సర్వే రిపోర్టు ఆన్‌లైన్ డాటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఎస్ఎస్ఆర్, ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యాలయ సిబ్బందితో సమావేశం ని